ప్రజాశక్తి
సోమవారం 27 నవంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆధునిక హంగులతో క్లాక్ టవర్

◆ 60 అడుగుల నిర్మాణానికి రూ.2.8 కోట్ల నిధులు కేటాయింపు ◆ జగదాంబ జంక్షన్‌లో సాగుతున్న పనులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒకప్పుడు ఎల్లమ్మ తోటగా ప్రసిద్ధి చెందిన ప్రదేశమది. 1970లో జగదాంబ థియేటర్ నిర్మాణంతో జగదాంబ జంక్షన్‌గా గుర్తింపునొందింది. తాజాగా ఇక్కడ మరొక అద్భుతమైన నిర్మాణం రూపుదిద్దుకుంటోంది. సరిగ్గా.. జగదాంబ థియేటర్ ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహం జంక్షన్‌లో రూ.2 కోట్లా 80 లక్షలతో అత్యంత ఆధునిక పద్ధతిలో క్లాక్ టవర్ నిర్మిస్తున్నారు. రెండు మాసాల క్రితం శంకుస్థాపన జరిగిన ఈ క్లాక్ టవర్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

జివిఎంసి నగరంలోని 20 జంక్షన్లను, 16 రోడ్లను రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగా జగదాంబ జంక్షన్‌లో రూ.2.8 కోట్లతో క్లాక్ టవర్ నిర్మిస్తోంది. ఇక్కడ క్లాక్ టవర్‌తో పాటు ల్యాండ్ స్కేటింగ్‌తో కూడిన ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రత్యేకంగా రూపొందించిన బూడిద రంగు ఇటుకలతో క్లాక్ టవర్ నిర్మాణం కానుంది. నాలుగు వైపులా గడియారాలు ఏర్పాటు చేస్తూ 60 అడుగుల ఎత్తులో నిర్మించనున్న క్లాక్ టవర్ జగదాంబ జంక్షన్‌కు మరొక ల్యాండ్ మార్క్ కానుంది. ఇక నగరానికి వస్తే కెజిహెచ్ ప్రవేశం వద్ద ఒక క్లాక్ టవర్ ఉంది. నాడు బ్రిటిష్ వారు లండన్ నుంచి తీసుకువచ్చిన గడియారం ఇక్కడ ఏర్పాటు చేశారు. అలాగే ఆంధ్ర యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం వద్ద క్లాక్ టవర్‌ను జైపూర్ మహారాజు 1926-1932 మధ్య ఏర్పాటు చేశారు. పాత నగరంలోని కురుపాం మార్కెట్ వద్ద కూడా క్లాక్ టవర్ ఉండేది. అయితే దీనిని మున్సిపల్ అధికారులు అప్పట్లో తొలగించారు. అలాగే ప్రస్తుతం జివిఎంసి పరిధిలో ఉన్న భీమిలిలో డచ్ వారు నిర్మించిన 'భీమిలి టవర్' ఈనాటికీ ల్యాండ్ మార్క్. ఇప్పుడు వీటన్నింటి సరసన జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ చేరనుంది. అయితే మిగతా 2లో..

క్లాక్ టవర్ నమూనా ప్రాంతం

శిలాఫలకం వద్ద మేయర్ తదితరులు (ఫైల్)

అనకాపల్లిలో నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మోడీ పర్యటనపై

నల్లజెండాలతో సిపిఎం నిరసన

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్రానికి అన్ని విధాలా ద్రోహం చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆది, సోమవారాల్లో తిరుపతిలో పర్యటించడాన్ని ఖండిస్తూ ఆదివారం అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం విభజన హామీలను నెరవేర్చలేదని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తోందని అన్నారు. విశాఖ రైల్వేజోన్ విషయంలో మోసం చేసిందన్నారు. గిరిజన యూనివర్సిటీ, ఐఐఎం, పెట్రో యూనివర్సిటీ నిర్మాణాల పనులు జరగడంలేదని, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఫ్యాకేజీ ఇవ్వకుండా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వడంలేదని తెలిపారు. కేంద్రం మెడలు వంచి రాజన్న పాలన తెస్తామని ప్రగల్భాలు పలికిన సిఎం జగన్ మోడీ మెప్పుకోసం గంగవరం పోర్టులో ఉన్న ప్రభుత్వ వాటాలను తెగనమ్మారన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల అమలుకు కేంద్రంపై పోరాటానికి సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలకు మిగతా 2లో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 2లో..

న్యాయ వ్యవస్థ బలోపేతం కావాలి

▶ వార్త 4లో..

ఎన్ఇపితో పేద విద్యార్థులు చదువుకు దూరం

▶ వార్త 5లో..

విశాఖ కలెక్టరేట్‌లో రాజ్యాంగ పీఠికను పఠిస్తూ ప్రతిజ్ఞ చేస్తున్న జెసి విశ్వనాథన్, తదితరులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

విశాఖ, అనకాపల్లిల్లో పలుచోట్ల ర్యాలీలు వార్త 7లో..

నగర భద్రతపై ప్రత్యేక దృష్టి

◆ రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి ◆ వాహనదారులు అప్రమత్తతతో మెలగాలి
◆ నేర నియంత్రణకు చర్యలు ◆ 'ప్రజాశక్తి'తో విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

'విశాఖ దేశంలోనే ప్రాధాన్యత కలిగిన నగరం. రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి నుంచే కార్యనిర్వాహక పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రచించిన నేపథ్యంలో భద్రత సవాలుగా మారింది. ఈ క్రమంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ప్రజలకు భద్రత కల్పిస్తాం' అని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అన్నారు. ప్రజాశక్తితో ఆయన పలు విషయాలను ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

విశాఖ నగరానికి నూతనంగా వచ్చిన మీకు ఏ విభాగాలు కఠినతరంగా ఉన్నాయి?

ఇతర నగరాలతో పోల్చుకుంటే విశాఖ చాలా భిన్నమైంది. ఇక్కడ ఓ పక్క సముద్రం, మరోపక్క నగర ప్రాంతం ఉండటం వల్ల ప్రజల భద్రతతో పాటు సముద్ర తీర భద్రత, ట్రాఫిక్, శాంతి భద్రతలు పెద్ద సవాలుగా ఉన్నాయి.

నగరంలో నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలేంటి ?

నగరంలోని రౌడీ షీటర్లపై పూర్తి నిఘా పెట్టాం. ఇటీవల కాలంలో పలు దీర్ఘకాలిక కేసులలో శిక్షలు విధించాం. తప్పు చేయాలనుకునే వారి ఆలోచన పూర్తిగా తొలగించాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

ఇటీవల నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఎటువంటి మిగతా 2లో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పాలకులు పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. డిసెంబర్ 8 నుంచి అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఏఐటియుసి, ఐఎఫ్‌టియుల అనుబంధ సంఘాల ఆధ్వర్యాన సమ్మెకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.తులసి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐసిడిఎస్ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పోషకాహారం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడం లేదన్నారు. గడిచిన నాలుగేళ్ళుగా ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ వేతనాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలన్న తమ డిమాండ్‌ను పట్టించుకోవడం లేదని వాపోయారు. తప్పని పరిస్థితుల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశానికి సమన్వయకర్తలుగా యూనియన్ సీనియర్ నాయకులు కె.బృంద, గౌరవాధ్యక్షులు పి.మణి, జిల్లా కార్యదర్శి ఎల్.దేవి, కోశాధికారి కె.పద్మావతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఆర్.శోభారాణి వ్యవహరించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు

పలు సంఘాల మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పడాల రమణ, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి లక్ష్మి, సిఎఫ్‌టియుఐ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు మహేష్, సమ్మి రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, ఆర్‌టిసి ఎన్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి ఎ.సీతామాలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బన్న, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎస్.కుమార్, పి.నారాయణమూర్తి, కెవిపి.చంద్ర మౌళి, మణికంఠ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు విశాఖపట్నం జిల్లా సిఐటియు నాయకులు, కార్యకర్తలు 250 మంది ఆదివారం రైళ్లలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మీడియాతో మాట్లాడారు. మహాధర్నా ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో తెలిపారు. తక్షణం డిమాండ్లను నెరవేర్చకుంటే 2024లో జరుగనున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికి కార్మిక వర్గం, రైతాంగం సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. మహాధర్నాకు వెళ్ళిన వారిలో నాయకులు ఎం.సుబ్బారావు, మణి, పద్మ, మేరీ, మంగర్రాజ్, కృష్ణ, పి.వెంకటరెడ్డి, అప్పలరాజు, లోకేష్, రామస్వామి, శ్రీను, అనసూయ, సత్యనారాయణ ఉన్నారు.

ఏఐటియుసి ఆధ్వర్యాన...

ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జిఎస్‌జె.అచ్యుతరావు నేతృత్వంలో విశాఖ జిల్లా నుంచి సంఘం కార్యకర్తలు విజయవాడకు తరలివెళ్లారు. ఎస్‌కె.రెహమాన్, కె.సత్యాంజనేయ, కె.సత్యనారాయణ, బి.వెంకట రావు తదితరులు మాట్లాడారు.

967వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 967వ రోజుకు చేరాయి. దీక్షల్లో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు కూర్చున్నారు. బిహెచ్ఇఎల్ (సిఐటియు) యూనియన్ ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్, షిప్‌యార్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం పోస్టర్లు అతికిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోగల పలు విగ్రహాల శిలాఫలకాలపై, అందమైన బొమ్మల గోడలపై, బస్ స్టాప్‌లలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపై, రైతు బజార్లలో, పార్కుల్లో, విద్యుత్ స్తంభాలపై ఇష్టానుసారం వాల్ పోస్టర్లు అతికిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిరుద్యోగులు రామ్‌కీ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, జిడిసి, ఆర్‌పిఎఫ్ తదితర విభాగాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనందున అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు రామ్‌కీ సంస్థ ముందుకొచ్చింది. ఈ క్రమంలో అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఆదివారం చైతన్య నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు గొండు సీతారాం, రామ్‌కీ ఫౌండేషన్ విశాఖ యూనిట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ భక్తి, రీజనల్ హెడ్ కె.శ్రీకాంత్‌లు ప్రవేశ పరీక్ష పేపర్‌ను విడుదల చేశారు. రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన రాష్ట్రంలో 600 మంది నిరుద్యోగులను ఎంపిక చేసి హైదరాబాద్, గుంటూరుల్లో రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలు 28న వెలువడతాయని తెలిపారు.

జాతీయవాది పురిపండా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జాతీయవాదిగా, అభ్యుదయ రచయితగా పురిపండా అప్పలస్వామి సామాజిక ప్రగతికి చేసిన కృషి అనిర్వచనీయమని డాక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. నగరంలో నిర్వహిస్తున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో అరసం జిల్లా సమితి నిర్వహిస్తున్న సాహిత్య సదస్సులో భాగంగా ఆదివారం 'పురిపండా సాహిత్యం - జీవితం, శ్రీశ్రీ సాహిత్యంలో విప్లవం' అనే అంశాలపై సదస్సులు జరిగాయి. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు.

దక్షిణ నియోజకవర్గానికి వాసుపల్లి వద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గానికి వాసుపల్లి వద్దు.. ఇంకెవరైనా ముద్దు అంటూ ప్లకార్డులతో పలువురు మత్స్యకారులు నినాదాలు చేశారు. మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని కొత్త జాలరి పేట గంగమ్మ గుడి వద్ద ఆదివారం వారు స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి తీరుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సురకల జంపన్న మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్‌లో విసిటిపిఎల్ నిర్మాణ సమయంలో 543 మంది మత్స్యకారులు వేట చేసుకునే ప్రదేశాన్ని కోల్పోయారన్నారు. వారికి నేటికీ న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే గణేష్ కుమార్ మత్స్యకారుడై ఉండి ఏనాడు అండగా ఉండలేదని విమర్శించారు. రింగు వలల సమస్య సమయంలో కూడా ఇక్కడి మత్స్యకారులకు ఆయన చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు సీటు కేటాయించవద్దని వైసిపికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వాడమొదలు పెంటయ్య మాస్టారు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అయ్యప్పరాజు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆధునిక హంగులతో క్లాక్ టవర్

వీటన్నింటికీ భిన్నంగా, ఆధునిక హంగులతో, రాత్రిపూట అద్భుతమైన లైటింగ్‌తో కూడిన ఫౌంటెయిన్ విన్యాసాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయని జివిఎంసి అధికారులు అంటున్నారు.

నల్లజెండాలతో సిపిఎం నిరసన

వస్తున్న మోడీ అక్కడే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు, సీనియర్ నాయకులు గండి నాయనబాబు, నాయకులు కె.ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరావు, తెల్లయ్యబాబు, సిహెచ్.శివాజీ, నూకఅప్పారావు పాల్గొన్నారు.

నగర భద్రతపై ప్రత్యేక దృష్టి

చర్యలు చేపడుతున్నారు?

నేను బాధ్యతలు చేపట్టాక పలు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి ముఖ్యంగా తెలుగు తల్లి ఫ్లైఓవర్, స్టీల్‌ప్లాంట్, ఆంధ్ర యూనివర్సిటీ, నిన్న కంచరపాలెం ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతిచెందడం చాలా బాధాకరం. ఈ సమస్యలు అధిగమించేందుకు నూతన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అందులో భాగంగా ఆదివారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీలో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ బస్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించాం. సుమారు 700 మంది పాల్గొన్నారు. ఇప్పటికే 12 యాక్సిడెంట్ జోన్‌లను గుర్తించాం. గత ఏడాది కాలంగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిలో ఈ ప్రాంతాల్లోనే 60 -80 శాతం మంది ప్రాణాలు కోల్పోయారు.

నూతనంగా తీసుకు రాబోయే విధానం ఏమిటి?

ప్రమాదాలను నివారించేందుకు, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ అన్ని విభాగాల అధికారులను రద్దీ ప్రాంతాల్లో ప్రత్యక్షంగా ఉదయం 8 నుంచి 10 :30 గంటల వరకు ఉపయోగించనున్నాం. గుర్తించిన ప్రాంతాల్లో ట్రాఫిక్ కమాండో/వార్డెన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నాం.

ట్రాఫిక్ కమాండో/వార్డెన్ వ్యవస్థ అంటే ఏమిటి ?

నగరంలో గుర్తించిన ప్రమాద ప్రాంతాల్లో ప్రతి కిలోమీటర్‌కు ఒకరు లేదా ఇద్దరు ఉండేటట్లు ట్రాఫిక్ కమాండో/వార్డెన్‌లను నియమించేందుకు ప్రణాళికలు రచించాం. వారికి పోలీస్ శాఖ ద్వారా శిక్షణ ఇచ్చి ప్రముఖ సంస్థల సిఎస్ఆర్ నిధులతో వేతనాలు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నాం. అదేవిధంగా వీరు ఆ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ, సిఐలకు అనుసంధానంగా ఉంటారు. మెడికల్ కిట్, బ్రీత్ ఎనలైజర్‌లు, ఇతర సామాగ్రి కలిగిన మోటార్ వాహనాలను అందించనున్నాం. వీరి పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలను కూడా ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

శాంతి భద్రతలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

త్వరలో సిఎం విశాఖకు రానున్నారు. అంతేకాకుండా పలు శాఖల అధికారులు, మంత్రులు విశాఖలో ఎక్కువగా పర్యటించే అవకాశం ఉంది. దీంతోపాటు డిసెంబర్ 4న నేవీ డే, నూతన సంవత్సర వేడుకలు, ఫిబ్రవరి 19 నుంచి 27 వరకు మిలన్ వేడుకలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖల అధికారులతో ఇప్పటికే చర్చలు జరిపాం.

ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో గస్తీకి తీసుకోబోయే చర్యలు ఏంటి ?

కొంతకాలంగా ఆ ప్రాంతంలో పలు అసాంఘిక కార్యకలాపాలు, దాడులు జరుగుతున్న మాట వాస్తవమే. ఆ ప్రాంతం పోర్ట్ అథారిటీ వారి ఆధీనంలో ఉంది. వారితో చర్చలు జరిపి అక్కడ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తాం.

బిసిల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిసిల బ్యాక్‌లాగ్ పోస్టులు 70 వేలు ఉన్నాయని, వాటిని తక్షణం భర్తీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ డిమాండ్ చేశారు. ఉన్నత పదవులు, నామినేటెడ్ పదవుల్లో బిసిలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి రీజనల్ ఇన్‌ఛార్జిలుగా రెడ్డి సామాజిక తరగతికి చెందిన వారే ఉన్నారని, ఒక్క ఇన్‌ఛార్జి పదవినీ బిసిలకు జగన్ ఇవ్వలేదని తెలిపారు. బిసిలు అంటే ఆయనకు చులకన అని తెలిపారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. రాజధాని తరలించకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నా సిఎం పట్టించుకోవడం లేదన్నారు.

మాట్లాడుతున్న గండి బాబ్జీ

విజేతలకు సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 8 నుంచి 12 వరకు ఫిలిప్పీన్స్‌లో జరిగిన 22వ ఏషియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన నగరానికి చెందిన పలువురు సీనియర్ క్రీడాకారులను ఆదివారం మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఎపి ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు సైకం రాంప్రసాద్, కార్యదర్శి బల్ల రమేష్ కుమార్, సుమీధ భారత్ ఫౌండేషన్ చైర్మన్ నాగ సుందరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెన్స్ 95 టు 99 ఏజ్ గ్రూపులో మూడు గోల్డ్ మెడల్స్‌ను షాట్ పుట్, జావలిన్, డిస్క్ త్రోలో సాధించిన శ్రీరాములను, 500 మీటర్స్ వాక్, షాట్‌పుట్‌లలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన కెవి.రావును, ఉమెన్స్ విభాగంలో పతకాలు సాధించిన డాక్టర్ కె.వైజయంతి మాల, వి.ఉష, కె.విజయలక్ష్మి, లావణ్యలను సత్కరించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
O.S. 346/2021

Between:
Senapati Girish Kumar, represented by his Authorized Person Jamula Govinda Rao.
...Plaintiff

And:
Banka Kanaka and others.
...Defendants

To,
Banka Ramji (D4)
S/o Ramappalanaidu, Hindu, aged 30 years, resident of Neltheru Village, Lodagalavanipalem Panchayat, Anandapuram Mandalam, Visakhapatnam District.

Whereas the above named plaintiff filed the above suit against you for permanent injunction amongst other reliefs and you are hereby directed to appear before the above mentioned court on **20-12-2023** by **10:30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte.

(By order of the court)
Sri.P.Venkateswara Rao, Sri. B.A. Raju, Sri.A. Sharad Kumar, Advocates, Bheemunipatnam. cell:9949474775

గొట్టిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ జగదీశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ యాతపేటలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణాలకు సర్పంచ్ గంటా జగదీశ్వరావు, భీమిలి యూత్ ప్రెసిడెంట్ వెంకట జగన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో రూ.20 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బుత్తల రాజేష్, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పతనం తథ్యం : టిడిపి

ప్రజాశక్తి -తగరపువలస : రానున్న ఎన్నికల్లో వైసిపి పతనం తథ్యమని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కోరాడ రాజబాబు జోస్యం చెప్పారు. భీమిలి మండలం, లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టిడిపి తొలి మేనిఫెస్టో బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం ప్రజా వేదిక సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డి.ఎస్.ఎన్.రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు బోని వెంకట రమణ, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పిఎం పాలెం : డబ్ల్యుకెఐ 19వ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పి.ఎం.పాలెం ప్రాంతానికి చెందిన వింగ్స్ చోటా ఖాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించినట్లు కోచ్ టి. సాయికుమార్ తెలిపారు. అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం సమీపంలో నిర్వహించిన పోటీల్లో 9 దేశాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. పి.ఎం.పాలెం వింగ్స్ చోటా ఖాన్ కరాటే సంస్థలో శిక్షణ పొందిన పోతిన అక్షయ ప్రణీత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 11 సంవత్సరాల ఖాతా కేటగిరిలో గోల్డ్ మెడల్, కుమతి విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని వివరించారు. పోతిన ధీరజ్ శ్రావణ్ సాయి 9 సంవత్సరాల ఖాతా కేటగిరీలో సిల్వర్ మెడల్, టి సాత్విక్ 5సంవత్సరాల ఖాతా, కుమతి కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పిఎం పాలెం ప్రాంతానికి చెందిన విక్టర్ షోటోకాన్ కరాటే విశాఖ డిస్ట్రిక్ట్ చైర్మన్ పోతిని ప్రసాద్ అభినందించారు.

సముద్ర తీరాన కార్తీక సందడి

ప్రజాశక్తి -మధురవాడ: కార్తీకమాసం నేపథ్యంలో సముద్ర తీరాన సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, రామానాయుడు ఫిలిం స్టూడియో, భావికొండ తదితర పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు సందడిగా గడిపారు.

29న వికలాంగుల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉచితంగా ఉపకరణాల పంపిణీ నిమిత్తం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద ఈ నెల 29వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వికలాంగులకు గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఆర్.రవికుమార్, కో-కన్వీనర్ టి.ప్రదీప్ కుమార్ ఆదివారం తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్, తెలుపు రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 2 పాస్ ఫోటోలు వికలాంగులు వెంట తీసుకురావాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలీమ్ కో సహకారంతో ఉపకరణాలు, కృత్రిమ అవయవాలు అందజేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 9502196387 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నృసింహ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా నృసింహ దీక్షలు ఆదివారం సంప్రదాయబద్ధంగా భక్తులు మాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ప్రధాన అర్చకులు, ఈవో సింగల శ్రీనివాసమూర్తి, ఇతర అధికారుల సమక్షంలో భక్తులకు మాలలు వేశారు. మాలదారులకు దేవస్థానం తరపున దీక్ష వస్త్రాలు, మాలలను, స్వామివారి పుస్తకాలను దేవస్థానం అధికారులు అందజేశారు. దీక్ష వస్త్రాలు, మాలలతో స్వామి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూనియర్ దళపతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జూనియర్ దళపతి పేరు గల నీటి ఏనుగుకు 6వ జన్మదిన వేడుకలు ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకుల మధ్య ఘనంగా నిర్వహించారు. 2017లో జూ పార్కులో జన్మించిన జూనియర్ దళపతికి ఇష్టమైన పుచ్చకాయ, అరటి పండ్లు, క్యారెట్, ఇతర కూరగాయలతో రూపొందించిన ప్రత్యేక కేక్‌ను జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా కట్ చేసి, దళపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌ను ఆహారంగా జూనియర్ దళపతికి అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు భారతి, రాజేశ్వరరావు, ఎడ్యుకేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

జూనియర్ దళపతికి కేక్‌ను తినిపిస్తున్న జూ సిబ్బంది

జైలు వార్డర్‌కు ఆర్థిక సాయం

వార్డర్ రాజేష్‌కు నగదు అందజేస్తున్న జైలు ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జైలు వార్డర్‌కు తోటి జైలు శాఖ ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల బొబ్బిలి సబ్ జైలులో జైలు వార్డర్‌గా పనిచేస్తున్న రాజేష్ తన కుటుంబ సభ్యులతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో రాజేష్‌తోపాటు భార్య, పిల్లలకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలై చికిత్స పొందిన రాజేష్‌కు జైళ్లశాఖ ఉద్యోగులు ముందుకు వచ్చి తోటి ఉద్యోగుల నుంచి సుమారు రూ.1.90 లక్షలు సేకరించారు. ఆదివారం విశాఖ కేంద్రకారాగారంలో పర్యవేక్షణాధికారి కిషోర్ కుమార్ చేతుల మీదుగా రాజేష్‌కు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -తగరపువలస : విద్యాపరంగా స్థానిక ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎంఎంఎస్‌లో ఉచిత శిక్షణ ఇస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న కొద్ది మందిలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావును ఆదివారం జివిఎంసి ఒకటో వార్డు సంతపేట సామాజిక భవనం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, మాజీ కౌన్సిలర్ జివి.రమణ, డాక్టర్ వి.ఎస్.కృష్ణ, కళాశాల సూపరింటెండెంట్ జివి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేఖ అప్పారావును సత్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

'ఏపిలో పారదర్శక పాలన'

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి 1, 3 వార్డుల పరిధిలో ఆదివారం 'ఏపికి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి ఒకటో వార్డు శ్రీనగర్, 3వ వార్డు తోటవీధి ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సభల్లో వైసిపి నాయకులు ఎం.రాము, ఎం.కృష్ణ, సిహెచ్.గౌరినాయుడు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, జగుపిళ్ల ప్రసాద్, వి.వెంకటరమణ, జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కోరారు. జివిఎంసి 46వ వార్డు పరిధి మధుసూదననగర్ కస్తూరినగర్ సచివాలయ పరిధిలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులందరూ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, చిన్ని, కోటా రామారావు, లావణ్య, విజయలక్ష్మి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-పెందుర్తి : కాంగ్రెస్ బలోపేతానికి అందరూ కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం జిల్లా బీసీ సెల్ చైర్మన్ ఆడారి రమేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బొడ్డ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి బూత్ కమిటీలను వేస్తూ పార్టీని బలోపేతం చేసేలా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవిందరాజు, పిసిసి ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లంకరాజు రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వినికోట రాము, షేక్ సఫి ఉల్లా, ముక్కా రామునాయుడు, లక్ష్మోజీ, ఆర్ఆర్.నాయుడు, సన్నిబాబు, బైలపూడి రాంబాబు, ఆర్ఆర్.నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దగ్ధమవుతున్న బట్టల దుకాణం

బట్టల దుకాణం దగ్ధం

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక మెయిన్ రోడ్డు వద్ద ఉన్న జస్వంత్ ఫ్యాషన్స్ రెడీ మేడ్ బట్టల దుకాణంలో ఆదివారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. బట్టల దుకాణం పైఅంతస్తులో ఆ దుకాణ యజమాని కుటుంబసభ్యులు నివాసముంటున్నారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? ఇంకేమైనా కారణం ఉందా? అన్నది తెలియాల్సి ఉంది. అసలే ఆదివారం సహజంగానే మెయిన్ రోడ్డులో జనం రద్దీగా ఉన్నారు. ఇంతలో అనుకోకుండా ఈ ప్రమాదం జరగడంతో ప్రజలు, సంబంధిత దుకాణం, పక్కనే ఉన్న బట్టల దుకాణ యజమానులు, పనిచేసే కార్మికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. సంఘటనా స్థలానికి ఎక్కువ సంఖ్యలో జనం తరలిరావడంతో పోలీసులు వారిని అదుపుచేయడం కష్టతరంగా మారింది. సమాచారం అందుకున్న చిట్టివలస ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని వెదుళ్లపాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బైకిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరం డిఎస్ఆర్ కాలనీకు చెందిన అంత్యాకుల నవీన్ కుమార్ (26) తునిలో తన స్నేహితుడిని కలిసి శనివారం రాత్రి బైక్ పై తన ఇంటికి బయలుదేరి వెళుతుండగా వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో నవీన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ బాధితుడిని స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అందించి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించగా ఆదివారం మృతి చెందినట్లు హెచ్‌సి వెంకటరావు తెలిపారు.

కృష్ణంరాజుపేటలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేటలో ఆదివారం గ్రామ వికాస్ సమితి ఆధ్వర్యాన స్వచ్ఛభారత్ నిర్వహించారు. పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం గొట్టిపల్లి సత్యనారాయణ, సమితి రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ ఉత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎగువపేట గ్రామ దేవత శ్రీపోలమాంబ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయం నుంచి కలశాలతో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల కోలాటం, తప్పెటగుళ్ళు, పులి వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలపల్లి కొండబాబు, గ్రామాభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జోరుగా ఓటరు నమోదు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11, 12 వార్డుల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యాన చేపట్టిన ఓటరు నమోదు, ఓటరు పరిశీలన కార్యక్రమం జోరుగా సాగుతోంది. 11, 12 వార్డుల టిడిపి ఇన్‌ఛార్జులు ముగడ రాజారావు, ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన ఆదివారం ఆరిలోవ, పెదగదిలి ప్రాంతాల్లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానికులు పెద్ద ఎత్తున ఓటుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆబోతుల అప్పలనాయుడు, కృష్ణంరాజు, బుడుమూరు గోవిందు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

ఆహ్వాన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న గంగారావు

చిల్డ్రన్ ఫెస్టివల్ ఆహ్వాన కమిటీ సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం చిల్డ్రన్స్ ఫెస్టివల్ ఆహ్వాన కమిటీ సమావేశం ఉక్కునగరంలో ఎంఎస్ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు హాజరై మాట్లాడారు. ఉక్కునగరంలో చిల్డ్రన్స్ ఫెస్టివల్ డిసెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు బాలల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఇప్పటికే 74 విభాగాలలో 14 వందల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్నదలచిన విద్యార్థులు, విద్యా సంస్థలు ఫెస్టివల్ కార్యదర్శి కె.సుశీల నెంబర్ 8309812422కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫెస్టివల్‌లో విద్యార్థులు ప్రదర్శించే కళా ప్రదర్శనలు, ఎకడమిక్ ఈవెంట్స్‌ను ప్రజలు తిలకించటానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రజలు వినియోగించు కోవాలని కోరారు. ఈ సమావేశంలో బి.పద్మావతి, ప్రదీప్, దుర్గాప్రసాద్, పార్థసారధి, మహేష్, సూర్యనారాయణ, మధు, కేశవానంద్, రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : న్యాయ సేవాకమిటీ ఆధ్వర్యాన ఆదివారం రెడ్డితుంగ్లాంలో వరకట్న వేధింపులు నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వరకట్న నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, వరకట్న వేధింపులకు పాల్పడే వారికి పడే శిక్షలను గురించి అవగాహన కల్పించారు. మహిళలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి.స్వామి, ఎపిపి ఎం.పావని, సీనియర్ న్యాయవాది బిఎస్‌సి దేవి, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరాకాలనీలో బతుకమ్మ పండగ

ప్రజాశక్తి ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీలోని శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా సుమారు 50 మంది మహిళలు బోనాలతో నృత్యాలు ప్రదర్శించారు. కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్నిరావు, మాజీ కార్పొరేటర్ పిల్ల కన్నబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాయపడిన కుమారిని పరామర్శిస్తున్న జియ్యాని శ్రీధర్

కుమారిని పరామర్శించిన జియ్యాని

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి అంబేద్కర్‌నగర్ ప్రాంతంలో నివాసముంటున్న నక్క ఈశ్వరమ్మ, ఆమె కుమార్తె నక్క కుమారి (అంధురాలు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మహారాణిపేటలోనిసాగర్ దుర్గా ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న వీరిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గొర్లె దేముడు తదితరులు పాల్గొన్నారు.

మెట్లు మార్గం, కాలువలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి కస్తూరినగర్-2లో కొండపైకి మెట్లు మార్గం, కాలువల నిర్మాణాలకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కె,చిన్న, కె.ఈశ్వరరావు, కె.రామారావు, కె.లావణ్య, శీతయ్యరెడ్డి, దుర్గాభవానీ, కె.శ్రీను, వరలక్ష్మి, అప్పలరెడ్డి, ఎఇ ఉమామహేశ్వరరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ నరేష్, వార్డు సిఒ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ బలోపేతం కావాలి

ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రేఖాశర్మ

సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రేఖాశర్మ, ప్రశాంతిభూషణ్, అనుపమచక్రవర్తి తదితరులు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : రాజ్యాంగ స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రేఖా శర్మ పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యాన దసపల్లా హోటల్‌లో ఆదివారం 'రాజ్యాంగ విలువలు- ప్రజాస్వామ్య పరిరక్షణ' అంశంపై జరిగిన జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును ఆమె ప్రారంభించి కీలకోపన్యాసం చేశారు. స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, బాధ్యతల నుంచి భారతదేశ రాజ్యాంగ రూపుదిద్దుకుందన్నారు. ప్రతి వ్యక్తీ హక్కులతోపాటు తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించాలన్నారు. ఒత్తిడి లేని తీర్పులు న్యాయమూర్తుల నిబద్ధతకు గీటురాయిగా నిలుస్తాయన్నారు. న్యాయమూర్తుల నియామకంలో ఎదురవుతున్న సంఘర్షణలు, కొందరు న్యాయమూర్తుల పనితీరు రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నట్లు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు ఉద్యోగ విరమణ తర్వాత ఎటువంటి పదవులూ నిర్వహించకపోవడం ఉత్తమం అన్నారు. రాజకీయ జోక్యం లేని న్యాయ వ్యవస్థ రావాలన్నారు. ప్రజాస్వామ్యానికి పవిత్ర గ్రంథమైన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి రాజ్యాంగ పరిధిలో నిందితుల హక్కులు అన్న అంశంపై ప్రసంగించారు. మహనీయుల త్యాగఫలంగా రూపొందించిన రాజ్యాంగాన్ని అపహస్యం చేసే సందర్భంగా రాకూడదన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, ఇటీవల కోర్టుల్లో తీర్పులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వస్తున్నాయని అత్యున్నత న్యాయస్థానంలోని అనేక కేసుల పరంపరను వివరిస్తూ వాపోయారు. కొలీజియం వ్యవస్థ స్థానంలో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ ఏర్పాటుచేస్తే కొంతవరకు న్యాయవ్యవస్థ పని తీరు బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్బిట్రేషన్ వ్యవస్థ ఒక పెద్ద వ్యాపారంలా తయారైందని అన్నారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలిపాటి గిరిధర్, పలువురు సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, ఐఎఎల్ ప్రతినిధులు కెఎస్ఎస్.సురేష్‌కుమార్, అజయ్‌కుమార్, విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు రామజోగేశ్వరరావు, మెంబర్లు పి.నర్సింగరావు, ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నేడు రజక వృత్తిదారుల ధర్నా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి -మాధవధార : రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు తెలిపారు. కంచరపాలెం పైడిమాంబ కాలనీ దోబీఘాట్ వద్ద సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రజకులకు రక్షణ చట్టం చేయాలని, 50 ఏళ్లు పైబడిన రజకులకు పెన్షన్ మంజూరు చేయాలని, దోబీఘాట్స్ నిర్మించాలని డిమాండ్‌చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు చేపట్టే ధర్నాను జయప్రదంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి, కె.ఉమ, కె.రమణ, కె.పరదేశి, కె.వసంతలక్ష్మి, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీమోహన్‌కు ప్రశంసా పురస్కారం

ప్రశంసా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మురళీమోహన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నానికి చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) కోశాధికారి డాక్టర్ మురళీమోహన్‌కు ప్రశంసా పురస్కార అవార్డును ఐఎంఎ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వి.అశోకన్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ, గుంటూరు మంగళగిరిలోని ఆదివారం నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఐఎంఎలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ జెసి.నాయుడు, డాక్టర్ సమరం, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, డాక్టర్ సిఎస్.రాజు, పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ మహోత్సవం

రాధాకృష్ణ మహోత్సవానికి ర్యాలీగా బయలుదేరిన యాదవ మహిళలు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక బీచ్‌లోని గోకుల్ పార్క్ వద్ద ఉన్న శ్రీ రాధాకృష్ణుల ఆలయం వద్ద ఆదివారం రాధాకృష్ణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కలశ ప్రతిష్ట చేశారు. యాదవ సంక్షేమ సంఘం నియోజక వర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జివిఎంసి మేయర్ జి.హరివెంకటకుమారి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు యలమంచిలి సూర్యనారాయణ, అక్కరమాని వెంకటరావు, అక్కరమాని రామునాయుడు, పిన్నింటి వెంకటరమణ, బమ్మిడి సూర్యనారాయణ, బొట్టా రామకృష్ణ, లొడగల రమణ, మొల్లి లక్ష్మణరావు, జి.ఎల్లయ్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తరలిన పారిశ్రామికప్రాంత వాసులు

ములగాడ : నగరంలో ఆర్‌కె బీచ్ వద్ద జరుగుతున్న రాధాకృష్ణ మహోత్సవానికి పారిశ్రామిక ప్రాంత యాదవ మహిళలు పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ర్యాలీగా బయలుదేరారు. యువత బాణసంచా కాలుస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నవ్వుతో ఆరోగ్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : నవ్వు ద్వారా మనిషి ఆరోగ్యకరంగా ఉంటారని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. హాస్యప్రియ కామెడీ క్లబ్ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్వించే నవరత్నాలు కామెడీ షో ప్రజలను ఆకట్టుకుంది. హాస్యప్రియ కామెడీ క్లబ్ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు మాట్లాడుతూ, సంస్థలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగి ఉండటంతో ఈ ప్రయాణం ఇంతవరకు సాగిందన్నారు. సెక్రటరీ ఇమంది ఈశ్వరరావు మాట్లాడుతూ, కామెడీని ఆస్వాదించే ప్రజలు ఉన్నంతకాలం హాస్యకామెడీ క్లబ్ ఉంటుందన్నారు. నవ్వు ఒక వరం అని, దాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ మస్తాన్‌రెడ్డి, తిలక్ పట్నాయక్, బి.శ్రీనివాసరావు, ఎమ్‌డి.ఖాన్, కొణతాల రాజు, విజయరమణ, హాస్య ప్రియ కామెడీ క్లబ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్, మల్కాపురంలో ఎన్‌టిఆర్ సేవా సమితి, ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యాన గీతం కాలేజీ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. గీతం మెడికల్ కాలేజీ వైద్య సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గీతం వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విశాఖ నుంచి పాలనకు సంఘీభావం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ పరిపాలనా వ్యవహారాలను విశాఖపట్నం నుంచి చేపట్టే ప్రక్రియకు రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు చెల్లపురెడ్డి జగన్మోహనరావు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణకు సంఘం తరపున జగన్మోహనరావుతో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.పాపారావు, ప్రధాన కార్యదర్శి రణప్రతాప్, సంఘం వ్యవస్థాపకులు అలీ అజ్జార్కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి 5
సోమవారం 27 నవంబర్ 2023

ఎన్‌ఇపితో పేద విద్యార్థులు చదువుకు దూరం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం వలన పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా మహాసభలు శని, ఆదివారాల్లో జరిగాయి. ఇందులో అతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య దీవెన, వసతి దీవెన సకాలంలో విడుదల చేయకుండా కొత్త నిబంధన పేరుతో విద్యార్థులను తిప్పడం దుర్మార్గమన్నారు. దీని వల్ల విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ పావని మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులను రోజురోజుకూ పెరుగుతున్నాయని, అయినా ప్రభుత్వాలు మహిళల రక్షణకు ఉన్న పటిష్టమైన చట్టాలు అమలు చేయడంలో విఫల మవుతున్నాయని విమర్శించారు. తమ హక్కుల రక్షణకు, అమలుకు విద్యార్థులు, మహిళలు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు మామిడి రమణ, కార్యదర్శి ఎస్.రమణ, కోశాధికారి గొర్లి తరుణ్, ఉపాధ్యక్షులు గీతాకృష్ణ, జాయింట్ సెక్రెటరీ బాలాజీ, కేశవ, వెంకటేష్, శ్రీను సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

శారదా పీఠాధిపతికి గ్రంథం అందజేస్తున్న ఎంవిఆర్

శారదా పీఠాధిపతిని కలిసిన ఎంవిఆర్

ప్రజాశక్తి-అనకాపల్లి : పెందుర్తి మండలం చిన్న ముషిడివాడలోని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని ఆయన పీఠంలో ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంవిఆర్‌ను చూసి, పీఠాధిపతి కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు, హిందూ ధర్మం పరిరక్షణతో పాటు అన్ని మతాలను కలుపుకునే వెళ్లే మీ అభిమతం తమ దృష్టికి వచ్చినట్లు ఎంవిఆర్‌ను స్వరూపానందేంద్ర సరస్వతి కొనియాడారు. ఇలాగే సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వామివారి ఆశీస్సులను ముత్యాల వెంకటేశ్వరరావు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ తన చేతుల మీదుగా స్వరూపానందేంద్ర సరస్వతికి గ్రంథాల పుస్తకాలను బహుకరించారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పూర్వపు విద్యార్థి గౌరీ శంకర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అభివృద్ధి కొరకు, విద్యార్థుల ఉన్నతికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాధాకృష్ణ, పి.కిరణ్‌కుమార్, అల్యూమ్నీ కోఆర్డినేటర్ జి నారాయణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ఎవి రమేష్, సీనియర్ అధ్యాపకులు సుధీర్, మాల్యాద్రి కళాశాల సూపరింటెండెంట్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

400 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఆదివారం నిర్వహించిన 116వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మంది కంటి రోగులకు శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ కంటి వైద్య శిబిరానికి 600మంది రోగులు రాగా, వారిలో 271 మందికి ఉచిత అద్దాలను అందించి, మిగతా 82మందికి మందులు ఇవ్వడం జరిగింది. 35 మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. మిగిలినవారికి డిసెంబర్ 10న జరిగే 117వ శిబిరానికి టోకెన్లు ఇవ్వడం జరిగింది. అలాగే రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 14 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కంటి వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న దొరస్వామి

రాజధాని జిమ్మిక్కులు ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేస్తున్న రాజధాని జిమ్మిక్కులను ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రకు వైసిపి ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలలో చేసిందేమీ లేదన్నారు. నాలుగు మాసాల్లో ఏమి ఉద్ధరించడానికి విశాఖపట్నం వస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే విశాఖపట్నం ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ భూములను బ్యాంకులకు తాకట్టు పెట్టేశారని, ప్రైవేట్ భూములు మీద పడతారన్న భయంతో ప్రజలున్నారని పేర్కొన్నారు. గంగవరం పోర్టు 32 వేల కోట్లు ఆస్తిని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అదాని గ్రూపుతో కుమ్మక్కై షేర్లకు ఆశపడి రూ.646 కోట్లకు అమ్మి వేశారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేందుకు ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. మంత్రి అమర్నాథ్ మీడియా ముందు రాజకీయం ఆవాకులు చవాకులు మాట్లాడడం తప్పితే ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క సమస్యని పరిష్కరించలేని దద్దమ్మలని మండిపడ్డారు. సమావేశంలో డాక్టర్ కెకెవి.నారాయణరావు, కడిమిశెట్టి నరసింగరావు, బొడ్డేడ మురళి, మళ్ళ గణేష్, కుప్పిలి జగన్మోహన్ రావు, విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బండారు సత్యనారాయణ

ఐఎంఎ చోడవరం శాఖకు 2 అవార్డులు

ప్రజాశక్తి-చోడవరం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) చోడవరం శాఖను రెండు అవార్డులు వరించాయి. వీటిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ చేతుల మీదుగా చోడవరం శాఖ అధ్యక్షులు బండారు సత్యనారాయణకు విజయవాడలో అందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ చోడవరంలో గతంలో పర్యటించింది. ఈ సందర్భంగా చోడవరం శాఖ చేస్తున్న కార్యక్రమాలు, విధివిధానాలను గుర్తించి ప్రశంసించింది. జగనన్న వైద్య సురక్ష కార్యక్రమంలో చోడవరం అసోసియేషన్ డాక్టర్ బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో శిబిరాల్లో పర్యవేక్షణతో పాటు సేవలందించారు. వీటిని గుర్తించి ప్రభుత్వం అవార్డును అందించింది. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణ మాట్లాడుతూ చోడవరం డాక్టర్ల సమిష్టి కృషితో ఈ గౌరవం దక్కిందని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్‌లో కుటుంబాలతో పిక్నిక్

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ 1970- 75 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం స్థానిక నూకాంబిక దేవాలయం సమీపంలో ఫైనాన్షియర్స్ సంక్షేమ సంఘం హాల్‌లో ఆదివారం ఆనందంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థుల క్షేమ సమాచారంలతో అందరూ ఒకరి నొకరు పలుకరించుకొని నాటి ముచ్చట్లు, సరదాలను గుర్తు చేసుకున్నారు. డిశంబరు నెలలో పూర్వ విద్యార్థుల కుటుంబాలతో కలిసి శంకరం బొజ్జన్న కొండ వద్ద వన సమారాధన జరిపేందుకు నిర్ణయించారు. ఈ ఆత్మీయ స్నేహితుల సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కమిటీ ఛైర్మన్ పిళ్లా శివ అప్పారావు, అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివ రామకృష్ణ, కోశాధికారి పట్నాల కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

28న సాయి కుల్వంత్ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల, వికాస సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిసిఎస్, డెక్కన్ కెమికల్స్, కోజెంటు ఈ సర్వీసెస్, నిట్ ఐసిఐసిఐ బ్యాంకులు, ఇసుజు మోటార్స్, సియాన్ ఈహెచ్‌డబ్ల్యుఓ సుమిత్, శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ పోస్టులకు గాను ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. నెలకు 12 వేల నుంచి 25 వేల వరకు జీతంతో పాటు భోజన వసతి, ఇన్సెంటివ్, రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాలలో 28న ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9849216362 లేదా 73864 87509 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలోని ప్రధాన ఆస్పత్రులలో ఎన్నో ఏళ్లుగా రోగులకు విశేష సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆరోగ్య మిత్రల కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిహెచ్.గోవింద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో జి.కనకం అధ్యక్షతన జరిగిన సంఘం అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభలో గోవింద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిగ్రీలు చదివి, రాత పరీక్షలు, ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగాలు సంపాదించిన ఆరోగ్య మిత్రలకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనాలు, ప్రమోషన్లు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాయిన్ అయినప్పటి జీతాలే ఇప్పటికీ కొనసాగడం దుర్మార్గమన్నారు. జగన్మోహన్ రెడ్డి తన ఎన్నికల పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్య మిత్రలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు వైఎన్.భద్రం, నాయకులు మూర్తి, రమణి, నాయుడు, శంకర్, కరుణ, రత్నకుమారి, జయమని, గన్నే రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

1500 ఎకరాల్లో ఎండిన వరి పంటలు

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం మండలంలో సుమారు 1500 ఎకరాల్లో వరి పంట వర్షాలు లేక నిలువునా ఎండిపోయింది. గంధవరం, ముద్దుర్తి, వెంకన్నపాలెం, బుచ్చయ్యపేట, కొత్తపల్లి, జన్నవరం, నరసాపురం, రేవళ్ళ, లక్కవరం, దామనపల్లి, మైచర్లపాలెం తదితర గ్రామాల్లో ఎండిన వరి పొలాలు దర్శనమిస్తున్నాయి. వందలాది ఎకరాలు పంట పోయిన కరువు మండలంగా ప్రకటించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు ఉన్న రైతులకు సేవలు అందించడంలో మాత్రం వెనుకబడి ఉన్నాయని విమర్శిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ఉన్న వారు పంట నమోదు నివేదికలు అధికారులకు అందించిన ఫలితం శూన్యంగా కనిపిస్తుంది. రాష్ట్రంలో కరువు మండలాలు ప్రకటించి చోడవరం వంటి మండలం లేకపోవడం శోయనీయమన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం ఊదరగొట్టడం తప్ప నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్న ధ్యాస లేదన్న విమర్శించారు. వేలాది రూపాయలు పెట్టామని, కనీసం పశుగ్రాసానికైనా గడ్డి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడూ ఇటువంటి వర్షాభావ పరిస్థితులు చెవి చూడలేదని వారు వాపోయారు. అధికారులు తమ పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గంధవరంలో నీరు లేక ఎండిన వరి చేను

దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మాజీ మంత్రి, విశాఖ ఉత్తరం నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలలో భాగంగా ఆదివారం వృద్ధులు, వికలాంగులకు 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి వేగి గోపికృష్ణ, టిడిపి నాయకులు నైయనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కలగా సోమేశ్వరరావు, జెర్రిపోతుల నూకునాయుడు, సర్పంచ్ కర్రి దుర్గనాయుడు, మాజీ సర్పంచ్‌లు బుదిరెడ్డి గంగయ్య, ఒమ్మి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఎన్‌సిసి దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఇందులో భాగంగా కళాశాల ఎన్‌సిసి క్యాడట్లు స్వచ్ఛ శారదా కార్యక్రమాన్ని, నది పక్కన ఉన్న శాంతి గార్డెన్‌లో స్వచ్ఛభారత్‌ను నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే సమాజ సేవను అలవాటు చేసుకొని, సమాజాన్ని ప్లాస్టిక్ రహిత సమాజంగా మార్చాలని సూచించారు. అనంతరం క్యాడట్స్‌కు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్‌లు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులును అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ దాడి జగదీశ్, లెఫ్టినెంట్ ఏఎస్ఎన్ మూర్తి, ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, జివిఎంసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, శ్రీనివాసరావు, సిబ్బంది, 120 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో బిసి కులాల ఐక్యతకు కృషి చేస్తామని ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మాసవరపు అప్పారావు అన్నారు. స్థానిక బృందావనం హోటల్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ నియామకం జరిగింది. అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా మాసవరపు అప్పారావు, అనకాపల్లి మండల అధ్యక్షులుగా పి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా గాజువాక పట్టణ అధ్యక్షులుగా డి గణేష్, పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులుగా పి.అప్పలరాజును నూతనంగా నియమించారు. వారికి కండువాలు వేయడం అభినందించారు. అనంతరం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మొల్లి రమణ బాబు ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లాల కార్యదర్శి పిల్లల శంకర్, ప్రధాన కార్యదర్శి కృష్ణం నాయుడు చేతులమీదుగా అప్పారావుకి నియామక పత్రం అందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పెంటకోట అప్పలనాయుడు కుటుంబానికి చీడికాడ మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు వాకపల్లి గ్రామ జనసేన నాయకులు బాలు సుందర్ చేతుల మీదుగా మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ సమక్షంలో అప్పలనాయుడు భార్య, కుమార్తెకి అందించారు. ఇప్పటికే మాడుగుల నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి సేకరించిన రూ.70వేలు నగదును ఇటీవలే ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాంబాబు, గణేష్, శివ, తులసిరావు, రాజు, మణి కుమార్, రమేష్, గోపి, చిరంజీవి వాకపల్లి, దిబ్బపాలెం గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

కార్మిక, కర్షక మహాధర్నాపై ప్రచారం

ప్రజాశక్తి -కశింకోట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కసింకోటలో సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు ప్రచారం చేశారు. ముఠా కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ముఠా. కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, 50 సంవత్సరాలు నిండిన ముఠా కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.లోవరాజు, దొరబాబు, జెర్రిపోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

కె.కోటపాడు : రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై జరుగు మహాధర్నా తరలిరావాలని రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిని బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రివలస, పాత వలస, సూదివలస గ్రామాలలో ఆదివారం ప్రచారం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పుష్పగుచ్ఛాలతో అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రియా ఫౌండేషన్, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా అందజేశారు. 18 మంది తెలుగు మీడియం బాలికలకు, 12 మంది ఇంగ్లీష్ మీడియం బాలికలకు పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఇసిఇఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వర్రి హరి, వసతి గృహ సంక్షేమ అధికారిని పి.సుజాత, రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు, పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్ లోకేష్, పైల శ్రీను, వరహాలరావు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ'పై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మేజర్ పంచాయతీ గవరపేట వీధి, పెద్దగుమ్మంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి టిడిపి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేగి గోపికృష్ణ, కాంట్రేగుల సతీష్, మళ్ళ లోవకృష్ణ, ఆడారి నరసింగరావు, తాకాసి కృష్ణ, పెంటకోట తాతారావు, వేగి రాము, పెంటకోట ఆనంద్, వేగి మోహన్, కోడెల రాము, సిలపరశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎంపిటిసి శ్రీనివాసరావు

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాలలో టిడిపి మినీ మేనిఫెస్టోపై ఆ పార్టీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి ప్రతి మహిళకు రూ.18 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3000, చదువుకునే వారికి రూ.15 వేలు, రైతులకు రూ.20 వేలు అందిస్తామని తెలిపారు.

బిఐఎస్ కేర్ యాప్‌తో

బంగారు ఆభరణాల స్వచ్ఛత తెలుసుకోవచ్చు

ప్రజాశక్తి- అనకాపల్లి : బిఐఎస్ కేర్ యాప్ ద్వారా బంగారు ఆభరణాల స్వచ్ఛతను తెలుసుకోవచ్చని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. ఫెడరేషన్ మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ కార్యాలయంలో 'మొబైల్ యాప్‌లో బంగారు ఆభరణాల స్వచ్ఛత' అంశంపై ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు ఆభరణాలకు కేటాయించిన హెచ్‌యూఐడీ (హాల్‌మార్క్ యునీక్ ఐడెంటిఫికేషన్) నెంబర్లు అసలువో, కావో యాప్ ద్వారా ధ్రువీకరించుకోవచ్చని చెప్పారు. బంగారు ఆభరణాలపై బీఐఎస్ ముద్ర, స్వచ్ఛత, ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ (అక్షరాలు, అంకెలతో) హెచ్‌యూఐడీ నెంబర్ ఉందా? లేదా? అని వినియోగదారులు కొనుగోలుకు ముందు పరిశీలించాలని సూచించారు. హాల్‌మార్కింగ్ నెంబరు కేటాయింపులో కొన్ని అసైనింగ్ సెంటర్లు మోసాలు చేస్తున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌యూఐడీ నంబరు ఉన్న బంగారు ఆభరణాన్ని మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలని సూచించారు. హెచ్‌యూఐడీ లేకుండా ఆభరణాలు విక్రయిస్తే సంబంధిత సరకు విలువపై 120 శాతం జరిమానా విధింపు, దుకాణాన్ని సీజ్ చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, కె.సుబ్రహ్మణ్యవర్మ, కెబిఎస్ఎస్ఎన్.రాజు, వి.వెంకటరాజు, డిఎస్‌వి.యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన డేవిడ్

ప్రజాశక్తి-చోడవరం : హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తిని చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగులు డేవిడ్ ఆదివారం విశాఖలో కలిశారు. ఇండియన్ అసోసియేషన్ లాయర్ల సమావేశాలకు హాజరైన అనుపమ చక్రవర్తిని డేవిడ్ కలిసి చోడవరం బారు అసోసియేషన్ గురించి, పలు విషయాలను ఆయనకు వివరించారు.

తంతడి బీచ్‌లో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాజేష్

మండలంలోని తంతడి సముద్రతీరంలో స్నానానికి దిగిన జంగాల రాజేష్ అనే విద్యార్థి ఆదివారం మధ్యాహ్నం గల్లంతయ్యాడు. మునగపాక మండలం తోటాడ గ్రామానికి చెందిన రాజేష్ ప్రస్తుతం పరవాడలో హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. రాజేష్ ఆదివారం తన ఫ్రెండ్స్ నలుగురితో కలిసి తంతడి బీచ్‌కు వచ్చారు. ముగ్గురు సముద్రంలో స్నానానికి వెళ్ళగా, ఇద్దరు తీరంలో ఆటలాడుతున్నారు. స్నానం చేస్తుండగా నీరు లోపలికి లాకెళ్ళిపోతుందని గట్టిగా కేకలు వేయడంతో తీరం వద్దున స్నేహితుడు వెళ్లి ఒకరిని పట్టుకుని ప్రాణాలు రక్షించాడు. రాజేష్ అంతలో లోపలికి వెళ్లిపోవడంతో అతన్ని రక్షించలేకపోయారు. రాజేష్ ఆచూకీ కనిపించలేదు. తల్లిదండ్రులు బంధువులు సమాచారం తెలుసుకొని తీరానికి వచ్చి విలపించడంతో తీరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మూడు నెలల కాలంలో తంతటి సముద్రతీరంలో ముగ్గురు గల్లంతయ్యారు. ఇక్కడ సముద్రతీరం స్నానాలకు అనువుకాన్ని ప్రదేశమని పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ వాటిని పట్టించుకోని పర్యాటకులు స్నానాలకు దిగి ప్రాణాల మీదుకు తెచ్చుకుంటున్నారు.

గ్రామాల్లో సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాక సచివాలయంలో ఎంపిడిఒ అప్పలనాయుడు ఆధ్వర్యాన జనజాతీయ సంకల్పయాత్రలో భాగంగా ఆదివారం కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యఅతిథులుగా స్పెషల్ ఆఫీసర్ చాముండేశ్వరిరావు, జెడ్పీటీసి శానాపతి జంధ్యారాణి రాము హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భజంత్రీలు లక్ష్మి, వైసీపీ అధ్యక్షులు కరణం రవి, హౌసింగ్ డిఇ, ఎపిఎం రాణి, మెడికల్ ఆఫీసర్, జెఇ సోమశేఖర్, జెడ్పీ స్కూల్ చైర్మన్ దేవరపల్లి రమణ, మొల్లేటి ప్రసాద్, కర్రి సింహాచలం పాల్గొన్నారు.

అనకాపల్లి : భారత సంకల్ప యాత్ర కార్యక్రమం మండలంలోని మారేడిపూడి గ్రామంలో నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సాలపు కనకరాజు, వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

51వ వార్డులో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెయ్యి వెంకటరమణ

సబ్బవరం లా కాలేజీలో..

గొలుగొండలో..

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్ర పటాలు, విగ్రహాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవ సదస్సు నిర్వహించారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. పాత్రికేయులు ఎస్.చలపతిరావు, న్యాయవాది జికెవి.రాజు, రచయిత కె.సత్తిరాజు పాల్గొన్నారు.

మాధవధార : 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పైడి శ్రీను, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, రెయ్యి గణేష్ పాల్గొన్నారు

మధురవాడ : ఎండాడలోని వైసిపి కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పార్టీ సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రామాటాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం- సమన్యాయం' అంశంపై సదస్సు నిర్వహించారు. రచయిత గొడిశాల జయరాజ్ ప్రసంగించారు. లా యూనివర్సిటీ మాజీ విసి వై సత్యనారాయణ, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బి.కళ్యాణరావు, కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, డాక్టర్ జి.జయరాజ్, జెవి.ప్రభాకర్ పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం : జివిఎంసి 1వ వార్డు పరిధి సంతపేటలో అంబేద్కర్ విగ్రహానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జివి.రమణ, ఉపాధ్యాయులు గంటాన మోహనరావు, రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గొట్టిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యాన, భీమిలిలోని అంబేద్కర్ కాలనీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, టి.లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు ఆధ్వర్యాన భీమిలిలోని గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం విశిష్టతను ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్ వివరించారు.

సింహాచలం: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింహగిరిపై దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాసమూర్తి దేవస్థానం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణలో బాధ్యతగా మెలగాలని కోరారు.

విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు నేతృత్వంలో 31వ వార్డు భీమ్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బన్న పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు కూరపాటి అప్పారావు, జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, నాయకులు ఎం.సుబ్బారావు హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు, డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, భవన నిర్మాణ సంఘం నాయకులు కె. నర్సింగరావు, సిఐటియు నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ అతిథి బంగ్లాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సుభద్ర, మూర్తి దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంవిపి.కాలనీ : విశాఖలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, ఇతర బ్రాంచ్ అధికారులు సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపించారు. ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, సిజిఎం అచ్చి రవికుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎంవిపి కాలనీ నగర శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పి.సురేష్, జె.శంకరరావు, వై.శిరీష, ఆర్.మణి పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో ఎపి హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్.సోమయాజులు ముఖ్య అతిథిగా, గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఆచార్య ఆర్. వెంకటరావు, ఫౌండర్ ఛాన్సలర్ ఆచార్య లక్ష్మీనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవ చరిత్ర, ముసాయిదా కమిటీ ప్రాముఖ్యత గురించి వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జోగి నాయుడు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ బివిఎస్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, విధేయత కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఎస్‌బి ఎస్సై బి.అంజిబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో అంబేద్కర్ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు, నిరంజన్ కుమార్, డాక్టర్ ఎంహరిబాబు, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని పేటబయ్యవరం పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నాయవాద వేషాలు ధరించి అలరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎయు.వరలక్ష్మి, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, బి.ధనలక్ష్మి, శ్రీనుబాబు, వీరభద్రరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

దేవరాపల్లి : రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా మండలంలోని తారువ డిప్యూటీ సిఎం క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, విశాఖ డెయిరీ డైరెక్టర్లు సూర్యనారాయణ, గెద్ద సత్యనారాయణ, సుందరపు గంగాధర్, వైసిపి నాయకులు రాజుబాబు, కెవి.రమణ పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు ఆధ్వర్యాన బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రాజ్యాంగ పీఠికను చదివి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిఎల్ఎన్ నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట జాతీయ రహదారి పక్కన అంబేద్కర్ విగ్రహానికి అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు పూల మాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, డి.సత్యారావు, అప్పారావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక సంత బయలులోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకట అప్పారావు, కార్యదర్శి బొడ్డేడ రామకుమార్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

తిమ్మరాజుపేట ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, టిడిపి నాయకులు కర్రి ఆదిబాబు, ఆర్.కృష్ణ పూలమాలలు వేశారు.

నక్కపల్లి:మండలంలోని వేంపాడులో ఎంపిటిసి సభ్యులు, భీమ్ సేన వార్ కార్యవర్గ సభ్యులు కుంచె మధు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ ఫోర్స్ ప్రతినిధులు గుడాల దావీదు, నక్కా ప్రసాద్, దువ్వాడ నానాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో గ్రంథాలయ అధికారి జనార్దన్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు

చీడికాడ:మండలం కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జోగేశ్వరి నివాళులు అర్పించారు.చీడికాడ చావిడి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. గాలి బుచ్చిబాబు, గాలి కోటి, మాధవ్, అనిల్ పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. విశాఖ ఉమ్మడి జిల్లా దళిత బహుజన సంక్షేమ సమాజం కన్వీనర్ మల్లేటి రాజు మాట్లాడారు.అంబేద్కర్ సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, పూడి అప్పారావు, ఎంపిటిసి పూడి దేవ, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు..

నర్సీపట్నం టౌన్:ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్.భాస్కర్ నాయుడు, గొలుగొండ జెడ్పిటిసి గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

యస్.రాయవరం:మండలంలోని కొర్రపోలు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నివాళి అర్పించారు. కొర్రపోలు నుండి అడ్డరోడ్డు ఫ్లైఓవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తతతతతత సమత సైనిక్ దళ్ అధ్యక్షులు గారా ప్రకాష్, జెడ్పిటిసి కాకర్ల దేవి, వైసీపీ సీనియర్ నాయకులు శ్రీపతిరాజు, సమత సైనిక్ దళ్ జెనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షులు పి అప్పారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం లో జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ పెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:సిపిఐ, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అబీద్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిహెచ్.క్రాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి లోవరాజు, ఉపాధ్యక్షుడు వై.పాపారావు, డిహెచ్‌పిఎస్ గొలుగొండ మండల నాయకులు నానాజీ పాల్గొన్నారు.

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో ఆదివారం సాయంత్రం మండల టిడిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ-భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం నియోజ కవర్గం టిడిపి ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు తో పాటు మండల పార్టీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు తదితరులు మాట్లాడుతూ,, రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి పలు పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో క్లస్టర్ ఇంఛార్జి బంటు శ్రీను, యూనిట్ ఇంఛార్జి కోట సత్తిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉగ్గిన శ్రీను, పోలింగ్ బూత్ ఇంఛార్జిలు శ్రీను, వాసు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తాతయ్య బాబు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పట్టణంలో పలువురు బాధితులకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం రూ.2.28లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గొలుగొండ మండలం చీడిగుమ్మలకు చెందిన పోతల చిన్నికకు రూ.28వేలు, లోకారపు రమణమ్మకు రూ.52వేలు, పోతల రాజుబాబుకి రూ.8వేలు, షేక్ మదీనాబికి రూ.70వేలు, షేక్ నూర్ బీ రూ.24వేలు, షేక్ రహమతుల్లా రూ.46వేల చెక్కులను ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్.భాస్కర నాయుడు, గొలుగొండ జెడ్పిటిసి గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

పరామర్శిస్తున్న రాంబాబు

పూరిళ్లు దగ్ధం

- బాధితులకు జెడ్‌పిటిసి రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చియ్యపేట మండలం లోవడ్డాదిలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానిక మోదమాంబ కాలనీలో గరికపాటి కొండమ్మ, పరిమళ దేముడమ్మకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు.ప్రమాదంలో సుమారు రూ. లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని బాధితులు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. చోడవరం టిడిపి ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, టౌన్ వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. జెడ్ పిటిసి దొండా రాం బాబు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుండి సహాయం అందేలా చర్యలు తీసుకొని జగన్న గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నివాళ్లు అర్పిస్తున్న సిపిఐ నాయకులు

మేకా సూరిబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతకేడిపేటలో ఆదివారం కామ్రేడ్ మేకా సూరిబాబు 36వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ సూరిబాబు స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. వెంకటరమణ మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు రమణ, రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, అల్లూరి జిల్లా సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ రీడింగ్ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం: కవగుంట గ్రామ పంచాయతీకి చెత్త బుట్టలు సరఫరా అయ్యాయని సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయం కన్వీనర్ దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పారిశుధ్య నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చెత్త బుట్టలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దీంతో, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి వీటిని అందించడం జరుగుతుందన్నారు.వీటిని గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాజానగరం పైపులైన్ పనులు ఆపండి: సిపిఎం

ప్రజాశక్తి-పాయకరావుపేట: కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమళపురం ప్రాంతంలోని బల్క్ డ్రగ్స్ కంపెనీల వ్యర్థ రసాయనాలను పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయితీ రాజానగరం రేవు దగ్గర సముద్రంలోకి వదలడానికి నిర్మిస్తున్న పైపులైను పనులు తక్షణమే నిలిపి వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. తొండంగి మండలంలో హేచరీల యాజమాన్యాలు తుని నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి అండదండలతో అడ్డగోలుగా వేస్తున్న పైపులైను పనులు మత్స్యకారులు అడ్డుకొని రెండు రోజులతున్నా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఆదివారం పైప్‌లైన్ ప్రాంతాన్ని సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు జిల్లాల అధికార పార్టీ నాయకులు, అధికారులు, బల్క్ డ్రగ్స్ కంపెనీ యాజమాన్యాలు కలిసి మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. పైప్ లైన్‌తో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు ఐక్యంగా పోరాడి పైపులైను అడ్డుకోవాలన్నారు. పార్టీ మండల నాయకులు బి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం తప్పదు

మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రజాశక్తి - మాడుగుల: ఎన్నికల ముందే సీఎం జగన్ మోహన్ రెడ్డి జైలుకు వెళ్ళడం ఖాయమని టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే రామానాయుడు తెలిపారు. వైసీపీ నాలుగున్నర ఏళ్లుగా దౌర్జన్యం, దోపిడీ బ్లాక్ మెయిల్ వంటి బెదిరింపు రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసిందని ఆరోపించారు. మాడుగుల నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అండతో వైసీపీ నాయకులు భూ దందాలు చేస్తున్నారని మండిపడ్డారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు,తెలుగు యువత అధ్యక్షులు వడ్డి రాజ్ కుమార్,ఎంపిటిసి పైలా ముత్యాల నాయుడు, టీడీపి నాయకులు డి వి జగదీశ్వర రావు, యల్లంకి మోహన్, గట్రెడ్డి కొండలరావు, కుంచంగి శ్రీనివాస రావు, బాదం నాగరాజు, సింగం శెట్టి రాజు నాయుడు, వంతాల పోతురాజు, టి పైడి రాజు,తదితరులు పాల్గొన్నారు,

మాట్లాడుతున్న రామానాయుడు

పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులుగా వినోద్ రాజు

ప్రజాశక్తి -యస్.రాయవరం: గత రెండు రోజులనుండి తిరుపతిలో జరిగిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్ర సర్పంచుల సంఘం ఎన్నికలు జరగగా ఉపాధ్యక్షులుగా రెండొవసారి మేజర్ల వినోద్ రాజు ఎన్నికైయ్యారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటానన్నారు.

వినోద్‌రాజును సన్మానిస్తున్న నేతలు

చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు చేసేదెన్నడో?

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పాటు ఈ నాలుగేళ్లలో చెరువులకు, కల్వర్టులకు చెక్ డ్యాంల మరమ్మతు చేయక పోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయిమండలంలో విస్తీర్ణం 3300 హెక్టార్లు కాగా వరి సాధారణ విస్తీర్ణం 1289 హెక్టార్లు. ఈ ఏడాది అడపాదడపా కురిసిన వర్షాలకు ఆగస్టులో 528 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. సెప్టెంబర్ చివరి వారంలో కురిసిన వర్షాలకు రెండవ సారి 761 హెక్టార్లలో నాట్లు వేశారు. మొత్తం 1289 హెక్టార్లకు 1269 హెక్టార్లలో నాట్లు వేసినట్లు వ్యవసాధికారులు చెబుతున్నారు. రెండవ దఫా నాట్లు వేసిన 761 హెక్టార్లకు ఎకరానికి 10 బస్తాలు కూడా దిగుబడి రాని పరిస్థితులు ఏర్పడ్డాయి. పొట్ట దశలో నీరు లేక ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. పెట్టుబడి మాత్రం ముందు నాట్లు వేసిన దానికంటే రెండవ దఫా వేసిన నాట్లకు అదనంగా పెట్టుబడి అయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు వంద ఎకరాలకు సాగునీరు అందించే చెరువులు మండలంలో ఎనిమిది ఉన్నాయి. కొమరవోలు ఆవ, తిమ్మరాజుచెరువు(కంచుగుమ్మల), కైసర్లవాని చెరువు (కుసర్లపూడి) అనిమిరెడ్డి చెరువు(జానకిరాంపురం), పోతల వానిచెరువు(కొవ్వూరు), పినపోతువారి చెరువు (నిండుగొండ), కనుమల చెరువు (కె.నాయుడుపాలెం), పక్షులవానిట్యాంక్ (బిబి. పట్నం) మిగతా చెరువులు 156 ఉన్నాయి.

మండలంలో చెక్‌డ్యామ్‌లు 15 ఉన్నాయి. ఈ నాలుగేళ్లలో చెరువులు, కల్వర్టులు, చెక్‌డ్యాంక్‌ల మరమ్మతు చేయకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో ఉన్న చెక్‌డ్యామ్ గోడ

బ్యాట్ ఇస్తున్న నిర్వాహకులు

క్రికెట్ బ్యాట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో ధర్మవరం-అగ్రహారం గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్స్ ఇచ్చినట్టు అచ్యుత్ ఫౌండేషన్ అధినేత అచ్యుత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం పండుగలు సందర్భంగా వివిధ గ్రామాల్లో జరుగుతున్న టోర్నమెంట్లకు, "ఆడుదాం-ఆంధ్ర" టోర్నీలో గ్రామ యువకులకు ఉపయోగకరముగా ఉండే విధంగా క్రికెట్ బ్యాట్ అందించినట్టు ఆయన తెలిపారు.

ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

ఘనంగా క్రీస్తురాజు మహోత్సవం

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట గ్రామంలోని ఆర్‌సిఎం చర్చిలో కొత్తకోట విచారణ గురువు అజయ్ ఆధ్వర్యంలో క్రీస్తురాజు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తురాజు విగ్రహంను గ్రామంలో పుర ప్రదక్షణ నిర్వహించారు. ఫాదర్ శ్రీపరంజ్యోతి క్రీస్తురాజు మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేరీఫాదర్, బాలరాజు ఫాదర్, విశ్వాసులు పాల్గొన్నారు.

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వాహనాల్లో తరలి రావడంతో జలపాతంలో వాహనాల రద్దీ ఏర్పడింది. ఇక్కడికి సందర్శించిన పర్యాటకులు సరదాగా జలపాతంలో జారుకుంటూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు.